## సమన్వయంతో ఏర్పాట్లు..

సభకు తరలి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 9 నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్, బీఆర్‌ఎస్ పార్టీ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ముజీబ్దీన్, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్ గుప్తా, షకీల్ అహ్మద్, హన్మంత్ షిండే, జాజాల సురేందర్ ఇప్పటికే సన్నాహక సమావేశాలు నిర్వహించారు. శ్రేణులను సమాయత్తం చేశారు. పార్టీ శ్రేణులతో పాటు స్వచ్ఛందంగా తరలివచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఆయా నేతలు సమన్వయంతో పని చేస్తున్నారు.




## సభకు వెళ్లే దారి ఇలా..

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలోని బీఆర్‌ఎస్ రజతోత్సవ సభా ప్రాంగణానికి సులువుగా చేరుకునేలా జోన్ల వారీగా రూట్ మ్యాప్‌లను సిద్ధం చేశారు. లక్షలాదిగా తరలి వచ్చే గులాబీ బంధుగణం కోసం ఐదు జోన్లను ఏర్పాటు చేశారు. ఆయా జోన్ల వారీగా ప్రత్యేకంగా ఐదు పార్కింగ్ జోన్లను సైతం సిద్ధం చేశారు. సభా ప్రాంగణానికి మొత్తం నాలుగు రహదారుల మీదుగా వాహనాలు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. అందులో మూడు జాతీయ రహదారులు (వరంగల్, సిద్దిపేట, కరీంనగర్) సహా సభ జరిగే చింతలపల్లికి చేరుకునేలా ధర్మసాగర్ నుంచి వచ్చే మరో రూట్‌ను కూడా సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి వెళ్లే వారు సిద్దిపేట జాతీయ రహదారి 765 మీదుగా సిద్దిపేట, హుస్నాబాద్, ముల్కనూర్, గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డు, ఇందిరానగర్ మీదుగా పార్కింగ్ జోన్–5కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. మరో రూట్‌లో వేలేరు, కొత్తకొండ, ముత్తారం వైపు నుంచి పార్కింగ్ జోన్–5కు చేరుకునే అవకాశం ఉంది. మరో రూట్ కరీంనగర్ మీదుగా వచ్చే వాహనాలను కోతులనడుమ మీదుగా దారి మళ్లించుకుని గోపాల్‌పూర్, గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డు, సిద్దిపేట జాతీయ రహదారి మీదుగా ఇందిరానగర్ నుంచి పార్కింగ్ జోన్–5కు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. సిద్దిపేట – హుస్నాబాద్ మార్గం నుంచి ఉమ్మడి నిజామాబాద్, మెదక్ జిల్లాలతో పాటు నిర్మల్, ఖానాపూర్, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు చెందిన కార్యకర్తలు, ప్రజలు వెళ్లాల్సి ఉంటుంది.

- ఉమ్మడి జిల్లా వాహనాలకు జోన్-5లో పార్కింగ్
- బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పకడ్బందీగా ఏర్పాట్లు
- కేసీఆర్ కోసం స్వచ్ఛందంగా తరలిరానున్న జనం
- 5 వేల వాహనాల్లో 50 వేల మంది వస్తారని అంచనా


# ఓరుగల్లు సభకు వెళ్లొద్దామిలా

ఎల్కతుర్తి సభకు రూట్‌మ్యాప్ ఖరారు

నిజామాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వరంగల్ జిల్లా ఎల్కతుర్తి వేదికగా బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్భవించిన ఉద్యమ పార్టీ 25వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా బీఆర్‌ఎస్ ఈ సభను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించనున్నది. కాంగ్రెస్ పాలనలో ఆగమైన తెలంగాణ రాష్ట్రానికి ఈ సభ దశ, దిశా నిర్దేశం చేయనున్నది. ఆవిర్భావం నుంచి పార్టీకి అండగా నిలిచిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి వేలాదిగా కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలి వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో వారికోసం బీఆర్‌ఎస్ నాయకత్వం 5 వేల వాహనాలు ఏర్పా టు చేసింది. సభా ప్రాంగణంలో ప్రత్యేక పార్కింగ్ వసతి కల్పించింది. ఉమ్మడి జిల్లా నుంచి వెళ్లే వారి కోసం రూట్‌మ్యాప్ సిద్ధం చేయడంతో పాటు జోన్–5లో పార్కింగ్ కేటాయించింది.

### వాహనాలు అందుబాటులో..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని 9 నియోజకవర్గాల నుంచి ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎల్కతుర్తి సభకు తరలి వెళ్లనున్నారు. ఇందుకోసం ఇప్పటికే 250 ఆర్టీసీ బస్సులు, 260 ప్రైవేటు బస్సులను సిద్ధం చేశారు. అలాగే, కార్లు, ఇతరత్రా వాహనాలు సైతం అందుబాటులో ఉంచా రు. నిజామాబాద్ జిల్లా నుంచి దాదాపుగా 2 వేలు, కామారెడ్డి జిల్లా నుంచి వేయి వాహనాలను సిద్ధం చేశారు. అవసరమైతే మరిన్ని వాహనాలు కూడా ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. రైతులు, మహిళలు, యువత ఎవరికి వారే ఎల్కతుర్తి సభ కోసం రెడీ అవుతున్నారు. ఉద్యమ కాలం మాదిరిగా కేసీఆర్‌ను చూసేందుకు, కేసీఆర్ సభకు హాజరయ్యేందుకు జనం సిద్ధమవుతుండడంతో బీఆర్‌ఎస్‌లో కొత్త జోష్ కనిపిస్తోంది.







# రేవంత్ వద్దు.. కేసీఆర్ ముద్దు

- రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లా నుంచి 40 వేలమంది
- ఇంకో పదివేల మంది వచ్చే అవకాశం!
- 2,400 వాహనాలు సిద్ధం చేశాం
- ప్రజల కోసమే బీఆర్‌ఎస్ పుట్టింది..
- 15 ఏండ్లు పోరాడి స్వరాష్ట్రం సాధించింది..
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఇదే జన నినాదం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, పక్కన రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ మేయర్ నీతూకిరణ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్, గడ్డం సుమన, బీఆర్‌ఎస్ నాయకులు

కంఠేశ్వర్, ఏప్రిల్ 25 : కాంగ్రెస్ పాలన తీరుపై విసుగు చెందిన ప్రజలు రేవంత్ వద్దు.. కేసీఆర్ ముద్దు అంటున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఇది జన నినాదమని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి జిల్లా నుంచి 40 వేల మంది తరలిరానున్నారని తెలిపారు. సభకు వెళ్లడానికి 2,400 వాహనాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి వరంగల్ సభకు 40 వేల మంది స్వచ్ఛందంగా తరలడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 50వేలు దాటినా ఆశ్చర్యపోనవసరంలేదన్నారు. వీరి కోసం 250 ఆర్టీసీ, 264 ప్రైవేట్ బస్సులు, 626 తుఫాన్లు, సొంత కార్లు 1266 అందుబాటులో ఉంచినట్లు వేముల తెలిపారు. వరంగల్ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేసి, కేసీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు. వరంగల్ సభ కోసం బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేశామని, న భూతో న భవిష్యత్తు అనే విధంగా సభ జరగనున్నదని పేర్కొన్నారు. సభను విజయవంతం చేయడానికి బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, ఎంపీ సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్‌గుప్తా, గంప గోవర్ధన్, షకీల్, సురేందర్, హన్మంత్ షిండే అందరం సమన్వయంతో పని చేస్తున్నామని తెలిపారు.

### బీఆర్‌ఎస్ పుట్టిందే ప్రజల కోసం..

బీఆర్‌ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసమని వేముల పేర్కొన్నారు. 15 ఏండ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత రాష్ట్రాన్ని సాధించినట్లు తెలిపారు. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత పదేండ్లలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్‌గా కేసీఆర్ నిలబెట్టారని అన్నారు. కానీ రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన 17 నెలల్లోనే తెలంగాణను విధ్వంసం చేశారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో పదేండ్లు సంక్షేమమైతే, రేవంత్‌రెడ్డి పాలన 17 నెలల విధ్వంసమన్నారు. రేవంత్‌రెడ్డి మాటలు విని తెలంగాణ ప్రజలు మోసపోయారన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయకుండా అన్ని వర్గాలనూ మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం అడిగినందుకు బాల్కొండ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జి చేసి, 33 మందిపై అక్రమ కేసులు పెట్టడం కాంగ్రెస్ పార్టీ రాక్షస పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సంక్షేమం గాలికొదిలి, దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు తీసుకోనిదే బిల్లులు మంజూరు చేయడంలేదని ఆరోపించారు.

### కాంగ్రెస్ కమీషన్ల ప్రభుత్వం

**రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్**



కాంగ్రెస్ పాలనలో అవినీతి రాజ్యమేలుతున్నదని, కమీషన్ లేనిదే ఏ పని కావడంలేదని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలుచేయడంలో రేవంత్ సర్కార్ ఘోరంగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ గోల్‌మాల్ గోవిందంగా తయారైందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో దోచుకుని ఢిల్లీకి మూటలు కడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో ఎవరైనా నీతిమంతులు ఉంటే, రేవంత్‌రెడ్డిని వెంటనే దించేసి ఆ పదవిని చేపట్టాలని సూచించారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ మేయర్ నీతూకిరణ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్, మాజీ జడ్పీటీసీలు జగన్, గడ్డం సుమన, నాయకులు సత్య ప్రకాశ్, సిర్ప రాజు, సుజిత్‌సింగ్ ఠాకూర్ పాల్గొన్నారు.

# చరిత్రలో నిలిచేలా 'రజతోత్సవం'

**అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం..**
**సబ్బండ వర్గాలు వరంగల్ సభ వైపు చూస్తున్నయ్..**
**ఎల్కతుర్తికి ప్రభంజనంలా తరలివెళ్దాం**
**బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పిలుపు**
**ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్ నియోజకవర్గాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష**

ఆర్మూర్ పట్టణంలో గోడపై రేవంత్ గోబ్యాక్–కేసీఆర్ కమ్ బ్యాక్ అని రాస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



కంఠేశ్వర్/ ఖలీల్‌వాడి, ఏప్రిల్ 25 : దేశ చరిత్రలోనే నిలిచిపోయేలా బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ నిర్వహించనున్నట్లు పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 27న 'చలో వరంగల్' కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్ నియోజకవర్గాల బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం జీవన్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సబ్బండ వర్గాల చూపు వరంగల్ సభ వేపే ఉన్నదని తెలిపారు. అంగరంగ వైభవంగా నిర్వహించనున్న గులాబీ పండుగ జనజాతర, తెలంగాణ ద్రోహులకు పాతరేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ అసలు సిసలైన తెలంగాణ ఇంటి పార్టీ అని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ తెలంగాణ సోయి లేని పరాయి పార్టీలని విమర్శించారు. బీఆర్‌ఎస్ తెలంగాణ రక్షణ కవచమని పేర్కొన్నారు. రేవంత్ సర్కార్ అవలంబిస్తున్న దగాకోరు విధానాలు, తెలంగాణ ప్రజలకు ప్రాణసంకటంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ రాక్షస పాలనపై వరంగల్ సభ యుద్ధభేరి మోగిస్తుందన్నారు. రాష్ట్రానికి శనిలా పట్టిన కాంగ్రెస్ అవినీతి చీడను, బీజేపీ మతోన్మాద పీడను వదిలించడానికి వరంగల్ సభ నాంది పలుకుతుందన్నారు. మళ్లీ కేసీఆర్‌తోనే అభివృద్ధి సంక్షేమ రాజ్యం వస్తుందని, ఆయనను ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా చూసేందుకు రేవంత్ గోబ్యాక్, కేసీఆర్ కమ్ బ్యాక్ అనే నినాదంతో పని చేస్తామన్నారు. నియోజకవర్గంలో అవినీతి కాంగ్రెస్, అరాచక బీజేపీ అంతం ఆర్మూర్ ప్రజల పంతమని పోరాట కార్యాచరణను రూపొందించుకుని పోరాడుదామని ఆర్మూర్ నాయకులకు పిలుపునిచ్చారు. జిల్లా నుంచి ప్రజలు వరంగల్‌కు ప్రభంజనంలా తరలివెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారని జీవన్‌రెడ్డి తెలిపారు.



నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ నాయకులతో సమీక్షిస్తున్న జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్

### గోడలపై స్టిక్కర్లు అంటించిన జీవన్‌రెడ్డి

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ కార్యకర్తలు, ప్రజలను ఆహ్వానిస్తూ ఆర్మూర్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి శుక్రవారం స్టిక్కర్లు అతికించారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ వాల్‌పెయింటింగ్ కూడా వేశారు. రేవంత్ గోబ్యాక్ – కేసీఆర్ కమ్ బ్యాక్ అని గోడలపై రాసి బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపారు

### సభాస్థలి పరిశీలన

**వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో** ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, స్థానిక నాయకులతో కలిసి ఎల్కతుర్తిలో బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభాస్థలిని శుక్రవారం పరిశీలించారు. జాజాల వెంట బీఆర్‌ఎస్ ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, నాగిరెడ్డిపేట్ మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, లింగంపేట్, నాగిరెడ్డిపేట్, గాంధారి మండలాలకు చెందిన నాయకులు ఉన్నారు. –ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 25



**రజతోత్సవ వేడుకలకు తరలివచ్చి కేసీఆర్‌ను ఆశీర్వదించాలి**
**మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**

# బీఆర్‌ఎస్ ప్రజల పార్టీ

కామారెడ్డి, ఏప్రిల్ 25 : బీఆర్‌ఎస్ ప్రజల కోసం ఏర్పాటు చేసిన పార్టీ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేసీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు. శుక్రవారం ఆయన కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ నివాసంలో మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, జాజాల సురేందర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకలు ఏడాదిపాటు నిర్వహించాలని కేసీఆర్ పిలుపునిచ్చారని తెలిపారు. వరంగల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభ తెలంగాణ ప్రజల కోసమే అని పేర్కొన్నారు. 15 సంవత్సరాలు అలుపెరగని పోరాటం చేసి ఒక్కడుగా బయల్దేరి, దేశ రాజకీయ వ్యవస్థను ఒప్పించి, తెలంగాణను సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. బిందెడు తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకునే దుర్భర పరిస్థితి నుంచి, ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా శుద్ధ జలాలను అందించిన నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. రాష్ట్రాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి చేసి, దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టారని చెప్పారు.

### ప్రజలు రేవంత్‌రెడ్డి వద్దు.. కేసీఆర్ ముద్దు అంటున్నరు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. అన్ని వర్గాల వారిని సీఎం రేవంత్‌రెడ్డి వంచించారని అన్నారు. ఘోరంగా మోసపోయామనే భావన ప్రజల్లో ఉందన్నారు. ప్రజలు రేవంత్ రెడ్డి వద్దు.. కేసీఆర్ ముద్దు అని అంటున్నారని తెలిపారు. కేసీఆర్ మళ్లీ ఎప్పుడు వస్తాడో అని ఎదురుచూస్తున్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు అనేక హామీలు ఇచ్చారని, వాటిని అమలుచేయాలని వరంగల్ సభా వేదిక నుంచి ప్రజల పక్షాన డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు.



కామారెడ్డిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పక్కన ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జాజాల సురేందర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్

# నిప్పుల కుంపటి

- దంచికొడుతున్న ఎండలు
- మెండోరాలో 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించిన అధికారులు



మోర్తాడ్/ఖలీల్‌వాడి, ఏప్రిల్ 25: ఉమ్మడి జిల్లాలో కొన్నిరోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. రోజురోజుకూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. బాల్కొండ నియోజకవర్గంలోని మెండోరాలో అత్యధికంగా 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకావడం గమనార్హం. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో 45.5 డిగ్రీలు నమోదుకాగా, నిజామాబాద్ జిల్లా మెండోరాలో 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై మూడోస్థానంలో నిలిచింది. జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించినట్లు తెలిపారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని, ఉదయం 8 గంటలలోపే పనులు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్‌లోనే ఎండలు ఇలా ఉంటే, మే నెలలో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.